క్లుప్తంగా

నేడు ధారూరుకు స్పీకర్

ధారూరు: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం మండల కేంద్రానికి రానున్నారని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధారూరు ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీటీసీల పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



నర్సింహులును సన్మానిస్తున్న గ్రామస్తులు

యాలాల: తాండూరు ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకమైన పగిడియాల గ్రామానికి చెందిన ఈడ్గి నర్సింహులుగౌడ్‌ను ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ నర్సింహులును పూలమాల, శాలువాతో సన్మానించి అభినందించారు. నర్సింహులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శేఖర్, దేవప్ప, శ్రీనివాస్‌రెడ్డి, మల్లప్ప, బందెప్ప ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్ : సీఎంఆర్ఎఫ్ పేదలపాలిట వరమని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన బసయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులకు రూ. 2.5 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆస్పత్రితో చికిత్స పొందే పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు పట్లోళ్ల నర్సింలు, వేణుగోపాల్, హబీబ్‌లాలా ఉన్నారు.

ఘనంగా రక్తమైసమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్ గ్రామంలో రక్తమైసమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని, ప్రదక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసం, శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవతమూర్తిని కోరారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్ : విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని ఏఎస్ కంప్యూటర్ నిర్వాహకులు పద్మనాభరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అనూస్ కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో పీజీడీసీఏ, సీడీఈఓ, ఏడీటీజీఎస్‌టీ కోర్సులకు సంబంధించి విద్యార్థులకు కంప్యూటర్ పరీక్షలు నిర్వహించారు. శిక్షణ తీసుకున్న 55మంది విద్యార్థులకు 40మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

వాగుపై వంతెన నిర్మించండి

వికారాబాద్ : కోట్‌పల్లి మండల పరిధిలోని మల్‌షెట్టిపల్లి తండా వాగుపై వంతెన నిర్మించాలని తండావాసులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. వంతెన లేకపోవడంతో వర్షాకాలం వాగు దాటడం ఇబ్బందిగా మారిందని వాపోయారు. ఇప్పటికే పలుసార్లు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తే గంటల తరబడి ఎక్కడి వారు అక్కడే ఆగిపోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు వర్షాకాలం నిత్యం అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. వాగుపై సీసీ బెడ్ వేసి వదిలేయడంతో నీరుపై నుంచే పారుతుందని చెప్పారు. నిర్మాణ సమయంలో పైపులు వేసినా బాగుండేదన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

పత్తి సాగే అధికం!

- ఎరువులు అందక రైతుల పాట్లు
- అధిక ధరలకు విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

పెద్దేముల్: మూడేళ్ల నుంచి పత్తి పంటకు మార్కెట్లో డిమాండ్ పెరగడంతో రైతులు ఈ ఏడాది కూడా పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు సకాలంలో కురవక పోయినా.. కొన్ని గ్రామాల్లోని అడపా దడపా కురుస్తున్న చిన్నపాటి చినుకులకే పత్తిని నాటుతున్నారు. గత ఏడాది పత్తిధర తగ్గిన, సాగు మాత్రం తగ్గడం లేదు. జిల్లాలోని పెద్దేముల్, బషీరాబాద్, బంట్వారం, కోటపల్లి, మోమిన్‌పేట, మర్పల్లితో పాటు పలు మండలాల్లో కంది పంట కంటే పత్తిసాగు అధికంగా సాగవుతున్నట్లు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలుస్తుంది.

పెద్దేముల్ మండలంలోని 30 రెవెన్యూ గ్రామాల్లో 41 వేల ఎకరాల పై చిలుకు వ్యవసాయ భూమి ఉంది. అందులో 38 వేల ఎకరాల వరకు రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి 11వేల 577ఎకరాలు, కంది 9వేల ఎకరాలల్లో సాగవుతోందని ఏఈఓ నజీరోద్దీన్ తెలియచేశారు. గత రెండేళ్ల క్రితం పత్తి ధర క్వింటాళ్కు రూ.8వేల నుంచి రూ.10వేలు ధర పలకడంతో మళ్లీ ధర ఉంటుందన్న ఆశతో రైతులు పత్తి పంట సాగుపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. కానీ, ధర తగ్గిన దిగుబడి రావడం, ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేయడంతో పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తాండూరు నియోజకవర్గంలో పత్తి, కంది పంటలకు అనువైన నేలలు ఉండటంతో ఈ ప్రాంత రైతులు ఈ పంటలను అధికంగా సాగుచేస్తున్నారు. గత మూడేళ్లగా ప్రభుత్వం నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేయడంతో రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకుంటున్నారు. ప్రతి విత్తనానికి బిల్లులు అడుగటంతో ఎరువుల దుకాణాల యజమానులు కూడా నాణ్యమైన విత్తనాలను విక్రయాలు చేస్తున్నారు. అయినా కొన్ని గ్రామాల్లో ఎరువుల దుకాణాల యజమానులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలకు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం.

ఎరువులు అందుబాటులో లేక ..

ఏటా వ్యవసాయ అధికారులు పెద్దేముల్ రైతు సేవా, తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఎరువులు , విత్తనాలు అందుబాటుల్లో ఉంచేవారు. ఈ ఏడాది తట్టెపల్లి ప్రాథమిక సహకార సంఘంలో తప్ప ఎక్కడ ఎరువులు అందుబాటుల్లో లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కంది, పత్తి, మినుము, పెసర విత్తనాలు నాటే సమయంలో డీఏపీ ఎరువులను రైతులు అధికంగా వాడుతుంటారు. అందుబాటుల్లో లేకపోవడంతో మార్కెట్‌ల్లో 50కిలోల బస్తాకు రూ.50 నుంచి 100వరకు ఎక్కువ ధరలకు విక్రయాలు చేస్తున్నారు.ధర అధికంగా ఉందని ప్రశ్నిస్తే ఎరువులు కూడా ఇవ్వటం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. మరికొంత మంది ఎరువుల దుకాణాల యజమానులు ఆసాముల పేరుతో రైతులను దోచుకుంటున్నారు. ప్రతి ఏటా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి.

సబ్సిడీ విత్తనాల జాడలేదు..

ఏటా ఖరీఫ్ పంటలు విత్తనాలు విత్తే సమయంలో గత ప్రభుత్వాలు కంది, పెసర, మినుముతో పాటు ఇతర విత్తనాలు సబ్సిడీపై లేదా ఉచితంగా పంపిణీ చేసేది. ఈ ఏడాది వాటి జాడలేదు. దీంతో విత్తనాల కోసం ఎదురు చూసిన రైతులు సమయానికి అందక మార్కెట్లో అమ్మో విత్తనాలను కొని పంటలు సాగు చేశామని రైతులు చెబుతున్నారు.

ఎరువుల కొరత లేకుండా చుడాలి



మండలంలో వందకు వందశాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. విత్తనాలతో పాటు ఎరువులను కూడా ఖరీదు చేయాల్సి ఉంటుంది. మండలంలో ఆరకొర ఎరువులు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు తెలియజేసిన లాభం లేదు. కొంత మంది ఎరువుల దుకాణాల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

వీరప్ప , రైతు గాజీపూర్

కంది సాగు తగ్గుతోంది



మండలంలో రెండేళ్ల నుంచి కంది సాగు తగ్గుతుంది. పత్తి సాగు పెరుగుతుంది. కందిసాగు ఎందుకు తగ్గుతుందో తెలియడం లేదు. దీనిపై గ్రామాల్లో సర్వే చేస్తున్నాం. విత్తనాలు కొనే ముందు రైతులు జాగ్రత్తలు పాటించాలి. వర్షాలు కురిసిన తరువాతనే పత్తి, కంది విత్తనాలు నాటాలి.

నజీరొద్దీన్ ఏఈఓ పెద్దేముల్ మండలం

సకాలంలో బస్సులు నడిపించాలి



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

తాండూరు: తాండూరు డిపో నుంచి ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులను సకాలంలో నడిపించాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల నుంచి విద్యార్థులు, రోజు వారి కూలీలు తాండూరుకు వస్తుంటారన్నారు. కావునా, డిపో నుంచి సకాలంలో బస్సులు నడిపించేలా చూడాలన్నారు. ఉ. 8 గంటలకు బస్సులు వెళితే 9 గంటల వరకు కళాశాల సమయానికి విద్యార్థులు చేరుకుంటారని అన్నారు. మరోవైపు రోజు వారి కూలీలు సైతం సమయానికి చేరుకుంటేనే పనులు దొరుకుతాయని, ఆలస్యం అయితే ఉపాధి కోల్పోతారన్నారు. సాయంత్రం సమయంలో తాండూరు నుంచి గ్రామాలకు నడిపించేలా ఆర్టీసీ అధికారులు చూడాలన్నారు. గ్రామాల నుంచి వచ్చే మహిళలకు బస్సు ఆపకుండా వెళ్లడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిలా అధ్యక్షుడు చంద్రయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, దళిత సంఘం నాయకులు ఉన్నారు.

పత్తిలో కలుపుతీత షురూ



పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు

మోమిన్‌పేట: గతవారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో కలుపుతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. విత్తిన 20రోజుల నుంచి పత్తిలో కలుపు మొక్కలు పెరిగి పత్తి ఎదుగుదలకు నష్టం కల్పిస్తుంది. కలుపు మొక్కలను తీసివేస్తే మొక్క ఎదుగుదల బాగుండి దిగుబడులు ఎక్కువగా వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. వర్షాధారంగా సాగు చేసే పంటల్లో పత్తిని రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. పెసర, మినుము, కంది, మొక్కజొన్న సాగుకు రైతు వెనుకంజ వేస్తున్నాడు. జాతీయ పక్షి నెమలి, అడవి పందుల బెడద వల్ల పత్తి తప్ప ఇతర పంటల సాగు చేయడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పత్తి మొలకలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.

గోవుల సంరక్షణ బాధ్యతగా భావించాలి



మారుతి కిరణ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

కుల్కచర్ల: గోవుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఘణపూర్ గ్రామంలో నిర్మిస్తున్న శివాలయం, సాయిబాబా ఆలయం, గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోమాత సంరక్షణ, పూజించడం చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గోశాలలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. గోసంరక్షణకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. హిందువులు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవా లని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఘణపురం వెంకటయ్య, రాఘవేందర్ గౌడ్, ఆంజనేయులు, నర్సింలు, శ్రీరామ్, హరి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం జరిగేనా?



వేలంలో పాల్గొన్న రైతులు (ఫైల్)

నేడు సంజీవ స్వామి ఆలయ భూముల కౌలు వేలం

దోమ : నేడు మండల పరిధిలోని సంజీవస్వామి ఆలయ భూములను అధికారులు కౌలు వేలం వేయనున్నారు. ఆలయానికి మొత్తం 104 ఎకరాల 19 గుంటల భూమి ఉంది. ఆ భూమిని రెండేళ్లకు ఓసారి అధికారులు కౌలు వేస్తుంటారు. కానీ, అధికారుల నిర్లక్ష్యానికి కేవలం గూడూర్ గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 135, 66, 173, 174లోని 46 ఎకరాల 03 గుంటల భూమి మాత్రమే కౌలు వేలం వేస్తూ తప్పించుకుంటున్నారు. మిగతా భూములను కౌలు వేయడం లేదు.

కౌలు వేయని భూములపై వసూళ్లు?

సంజీవస్వామి ఆలయానికి పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా భూములు ఉన్నాయి. అయితే, పూడూర్ మండలం కెరెళ్లి గ్రామంలోని సర్వే నంబర్ 110లో 1.33 గుంటలు, పరిగి మండలం మంచన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 66లో 9.39 గుంటలు, ఖుదావంద్‌పూర్ గ్రామంలోని సర్వేనంబర్ 108లో 4.20 గుంటలు, హీరాపూర్ గ్రామంలోని 23 సర్వేనంబర్‌లో 4.18 గుంటలు, దోమ మండలం దొంగ ఎన్కేపల్లి గ్రామంలో సర్వేనంబర్ 38లో 3.02 గుంటలు, సర్వేనంబర్ 9లో 2.33 గుంటలు, కిష్టాపూర్ 167 సర్వేనంబర్‌లో 38 గుంటలు, బ్రహ్మణపల్లి గ్రామంలో 103 సర్వేనంబర్‌లో 1.31 గుంటల భూములను ఆయా గ్రామాలకు చెందిన రైతులు సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ భూములను వేలం వేయకుండా ఓ ప్రజాప్రతినిధి నిలవరిస్తున్నట్లు సమాచారం. అదే కాకుండా సాగు చేస్తున్న భూమికి సంబంధించి ఎకరానికి రూ. 10 వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయం అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల కౌలు రైతులు ఆరోపిస్తున్నారు.

మొత్తం భూములను వేలం వేయండి

ఆలయ పరిధిలో ఉన్న మొత్తం 104 ఎకరాల 19 గుంటల భూమిని అధికారులు కౌలు వేలం వేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. కేవలం గూడూర్ గ్రామానికి చెందిన భూములను మాత్రమే కౌలు వేలం వేయడం ద్వారా ఆలయానికి ఆదాయం తగ్గుతుందని తెలిపారు. ఉన్న మొత్తం భూములను కౌలు వేస్తే ఆదాయం పెరిగి శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పునర్మించుకోవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మొత్తం భూములను కౌలు వేలం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

యాలాల: మండలంలోని ముకుందాపూర్ గ్రామానికి చెందిన భీమప్ప శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా గ్రామానికి చేరుకొని, భీమప్ప మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు కుర్వ మహిపాల్, రాజు తదితరులు ఉన్నారు.

జీపీ వర్కర్ల వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్

బంట్వారం: గ్రామ పంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మహిపాల్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల పోషణ భారమైందన్నారు. ఇప్పటికే సమస్యను పలుసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి పెండింగ్ వేతనాలను చెల్లించాలని, లేనిచో పెద్దఎత్తున ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి



బోటింగ్ చేస్తున్న వారిని తిలకిస్తున్న పర్యాటకులు



నీటిలో ఆడుకుంటున్న యువతులు

ధారూరు: ఆదివారం సెలవు కావడంతో కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ప్రాజెక్టు పరిసరాల్లో తిరుగుతూ ఎంజాయ్ చేశారు. బోటింగ్ చేయడానికి ఎక్కువ మంది ఆశక్తి చూపినా వేచిచూడక తప్పని పరిస్థితి నెలకొంది. తగినన్నీ బోట్లు లేకపోవడంతో వారంతా వేచిచూసి తమ వంతు రాగానే బోటింగ్ చేశారు. చిన్నారులు, యువతీ, యువకులు నీటిలో ఆడుకుంటూ సెల్ఫీలు తీసుకున్నారు.

కుదురుమళ్లలో భారీ వర్షం



పాఠశాల ఆవరణలో చేరిన వర్షం నీరు



ఆదర్శనగర్‌లో జనావాసాల మధ్య వరదనీరు

- కుంటను తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం
- శిథిలాలు తొలగించకపోవడమే కారణం

దుద్యాల్ : మండలంలోని కుదురుమళ్ల గ్రామంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వరదనీరు చేరి కుంటను తలపిస్తుంది. ఇటీవలే అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి భాగంగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల గదిని కూల్చేశారు. కూల్చిన శిథిలాలను తొలగించకుండా అలాగే ఉంచడంతో పాఠశాల ఆవరణలోని నీరు నిలిచి విద్యార్థులకు ఇబ్బందిగా మారింది.

తాండూరులో భారీ వర్షం

తాండూరు టౌన్ : పట్టణంలో కురిసిన భారీ వర్షానికి పలు వార్డులు జలమయమయ్యాయి. ఆదర్శనగర్, భవానీనగర్, గ్రీన్‌సిటీ, సాయిపూర్‌తో పాటు పలు వార్డుల్లో వరద నీరు జనావాసాల మధ్య చేరింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మల్‌రెడ్డిపల్లి మార్గంలోని పాండురంగ దేవాలయ సమీపంలో పెద్ద వేపచెట్టు వానాగాలికి నేల కూలింది. చిలకవాగు కబ్జా చేసి అక్రమ కట్టడాలు నిర్మించడంతోనే వరదనీరు జనావాసాల మధ్యకు చేరుతోందన్నారు.



పరిగి: రోడ్డుపై పడ్డ చెట్టును తొలగిస్తున్న దృశ్యం

పంటపొలాలు కళకళ

రోడ్డుపై కూలిన చెట్టు తొలగింపు

పరిగి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఖుదవన్‌పూర్ గ్రామ సమీపంలో పరిగి- షాద్‌నగర్ ప్రధాన రోడ్డుపై భారీ వృక్షం ఈదురు గాలులకు కూలింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురికావడంతో ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సంతోష్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో చెట్టును రోడ్డుపై నుంచి తొలగించారు.

తాండూరు రూరల్: మండలంలో శనివారం రాత్రి పెద్ద ఎత్తున వర్షం కురిసింది. చాలా రోజుల తర్వాత వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంగెంకలాన్ , మల్కాపూర్, అల్లాపూర్ పలు గ్రామాల్లో పంటలు కళకళలాడుతున్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అనంతగిరి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆల్ ఖైర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ రావుఫ్ అన్నారు. వికారాబాద్‌లోని ఇస్లామిక్ సెంటర్‌లో మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. పూర్తి చేసుకున్న వారికి ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, స్వయం సమృద్ధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. కారక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త తస్వర్ అలీ, జమతే ఇస్లామీ హింద్ వికారాబాద్ అధ్యక్షుడు మొహమ్మద్ ఫాయాజ్, టైలారింగ్ సెంటర్ నిర్వాహకురాలు షమీమ్ బేగం ఉన్నారు.

◆ లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

బంట్వారం: వన మహోత్సవంలో భాగంగా మండలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాల్సి ఉంటుందని ఎంపీడీఓ రాములు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 4500 మొక్కలు నాటాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే నర్సరీల్లో 18 రకాల మొక్కలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. గుంతల తవ్వకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. వర్షాలు బాగా కురవగానే ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయంలో మొక్కలు నాటుతామన్నారు.

◆ అసైన్డ్ భూములపై విచారణ

పూడూరు: ఆక్రమణకు గురవుతున్న ఎన్కేపల్లి అసైన్డ్ భూములపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మన్నెగూడలో విలేకరులతో మాట్లాడారు. ఎన్కేపల్లి మాజీ సర్పంచ్ జుబ్బురు రాములు నకిలీ పత్రాలు సృష్టించి భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సర్వే నంబర్ 99, 101లో గల 125 ఎకరాల విలువైన భూములను నకిలీ ఎక్స్ సర్వీస్‌మెన్ల పేర్లతో సర్టిఫికెట్లు సృష్టించి విక్రయిస్తున్నారని వాపోయారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, రాంచందర్, మల్లేష్, శ్రీశైలం, విఠల్ ఉన్నారు.

◆ ఘనంగా పసుక పండుగ

వికారాబాద్: మండల కేంద్రంలో క్రైస్తవ సోదరులు పసుక పండగ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు భజనలు చేశారు. అనంతరం మండల కోట్ మర్పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న శిలువకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖంగా ఆయురారోగ్యాలతో ఉండాలని పసయ్యకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మర్పల్లి మెథడిస్టు సెంట్రల్ చర్చి పాస్టర్ ప్రణీత్ కుమార్ బైబిల్ పవిత్ర గ్రంథంలోని దేవుని వ్యాఖ్యాలను భక్తులకు చదివి వినిపించారు.

◆ బాలగోకులంలో చిన్నారుల సందడి

తాండూరు టౌన్ : తాండూరు పట్టణం ఆదర్శ తులసీనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో ఆదివారం నిర్వహించిన బాలగోకులంలో చిన్నారులు సందడి చేశారు. భగవద్గీత శ్లోకాలు, పొడుపు కథలు, రామాయణం, మహాభారతంలోని కథలను మాతాజీ లక్ష్మి, భారతి చిన్నారులకు బోధించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, హైందవ ధర్మంపై అవగాహన కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం ఉ.10 గంటల నుంచి 11 గంటల వరకు ఉచితంగా చిన్నారుల కోసం బాలగోకులం నిర్వహిస్తున్నామని చెప్పారు.

◆ విరాళం ఇవ్వండి

వికారాబాద్ : కోట్‌పల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న వీరశైవ సమాజం భవన నిర్మాణానికి విరాళం ఇవ్వాలని ఆ సమాజం ప్రతినిధులు ఆదివారం తాండూరులోని వీరశైవ సమాజ కార్యవర్గాన్ని కోరారు. ఈ సందర్భంగా కోట్‌పల్లి ప్రతినిధులు వారికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవన నిర్మాణం స్లాబ్ లెవల్‌లో ఆగిపోయిందన్నారు. నిధుల సమస్యతో నిలిచిపోయిన పనులను పునరుద్ధరించేందుకు విరాళం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై తాండూరు వీరశైవ సమాజం ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

◆ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం

ధారూరు: మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభం పడిపోయి తీగలు తెగిపడ్డాయి. ఈ ఘటన ధారూరులోని జెండాబావి సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక చోటు చేసుకుంది. గాలివానకు అక్కడ ఉన్న రావిచెట్టు కొమ్మ విరిగి విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో స్తంభం విరిగిపోయి, తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అప్పటి నుంచి సరఫరాను నిలిపివేశారు. ఆదివారం సాయంత్రం వరకు వస్తూ, పోతూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. సెలవుదినం కావడం, ఏఈ, ఇతర అధికారులు ఫోన్లు లేపడం లేదని, సిబ్బందికి చెప్పిన పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోయారు. రావిచెట్టు పక్కనే ఉన్న మరో వేపచెట్టు కొమ్మ సైతం విరిగిపడి ధారూరు మొత్తానికి సరఫరా నిలిచిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరించి, కేక్‌కట్ చేస్తున్న నాయకులు

తాండూరు టౌన్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తాండూరు పట్టణంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాలో మందకృష్ణ మాదిగ నా యకత్వంలో కొద్ది మందితో ప్రారంభించిన మాదిగ దండోరా ఉద్యమం నేడు దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించిందన్నారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు, ఆరోగ్యశ్రీ పథకం వంటివి ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమేనన్నారు. ఆవిర్భావం మంద కృష్ణ మాదిగ జన్మదినం ఒకే రోజు కావడంతో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు.